క్లుప్తంగా

నేడు యాలాలలో ఎమ్మెల్యే పర్యటన

యాలాల: పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం మండలంలో పర్యటించనున్నట్లు యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్కెపల్లి నుంచి అగ్గనూరు, చెన్నారం, అక్కంపల్లి, జుంటుపల్లి, సంగెంకుర్దు, యాలాల, నాగసముందర్, పగిడియాల, రాస్నం గ్రామాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి జాతర



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై వెలిసిన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతం, అభిషేకం, మహానివేదన, రాత్రి రథోత్సవం, తొట్ల సేవ ఉంటుందని పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పరిగి: యువత నిజాయతీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆనంద్ రావు సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పల్లవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. యువత చేతిలోనే భవిష్యత్తు ఉందన్నారు. ఓటును అమ్ముకుండా నిజాయతీగా నాయకున్ని ఎన్నుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. ఓటు వినియోగంపై ఇంట్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం అందజేత



శివాజీ విగ్రహం వద్ద బీజేపీ నేతలు

కుల్కచర్ల: ఇచ్చిన మాట ప్రకారం భూనేటి మారుతి కిరణ్ శివాజీ విగ్రహాన్ని ఇప్పించారని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. యువజన సంఘాల నాయకుల కోరిక మేరకు శుక్రవారం బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ వీరాపూర్‌లో శివాజీ విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బంధయ్య మాట్లాడుతూ.. ఎన్నికలతో సంబంధం లేకుండా హిందుత్వవాదాన్ని బలపరుస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కిరణ్ సహాయం అందిస్తున్నాన్నారు. యువజన సంఘాల విజ్ఞప్తి మేరకు శివాజీ విగ్రహాన్ని ఇప్పించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, రాజశేఖర్, శ్రీనివాసులు, పాండురంగయ్య, ఆంజనేయులు, శేరిరాంరెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



సత్యం కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చర్లగూడ గ్రామానికి చెందిన కొత్తమాల సత్తయ్య(40) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ శుక్రవారం చర్లగూడ గ్రామాన్ని సందర్శించి మృతుని భార్య లక్ష్మికి రూ.10వేల సాయం చేశారు. అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కిందివనం సత్యం భార్య లతను పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తానని ఆయన చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి వారికి రైతుబంధు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పూజిత, పుష్పమ్మ, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాంచందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

‘పల్లె ప్రకృతి’కి సమ్మర్ సెగ

- వేసవికి ముందే మండుతున్న ఎండలు
- వాడిపోతున్న మొక్కలు



దౌల్తాబాద్‌లోని పల్లె ప్రకృతి వనం

దౌల్తాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. పల్లెలకు కొత్తదనం వచ్చేలా వీటిని నిర్మించారు. వనాల్లో ఆహ్లాదం కోసం సేదతీరేలా అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను నాటారు. గ్రామాలకు సమీపంలో వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలతో పాటు చిన్న పిల్లలకు ఉపయోగకరంగా మారాయి. వీటి నిర్వహణకు పెద్ద ఇబ్బందులు లేవు. కానీ ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్నాయి. చెట్లు, పూలు, పండ్ల మొక్కలకు నీటిని అందిస్తేనే పచ్చదనానికి విఘాతం ఏర్పడనుంది.

అన్ని గ్రామాల్లో ఏర్పాటు

మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. హరితహారంలో పల్లె వనాలను ఏర్పాటు చేయడంతో గ్రామాలు పచ్చదనంతో నిండుకున్నాయి. వీటి నిర్వహణలో గ్రామ పంచాయతీలు, ఉపాధి హామీ సిబ్బంది కృషి అమోఘం. ప్రతి గ్రామంలో 20 గుంటల నుంచి ఎకరం విస్తీర్ణంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులు అందుబాటులోకి తీసుకువచ్చారు. హరితహారం పథకం మొక్కలను పంచాయతీలకు అప్పగించారు. పల్లె ప్రకృతి వనం చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు కమాన్, గేట్‌ను గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్మించారు.

పంచాయతీలదే బాధ్యత

ప్రకృతి వనాల ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ పాలకవర్గాలు నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. మొక్కలు నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహణ ఖర్చు అందించగా ఆ తరువాత నుంచి గ్రామ పంచాయతీలు బాధ్యత తీసుకున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఇన్నాళ్లు ప్రకృతి వనాలకు వేసవిలో సైతం ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి ప్రత్యేక అధికారుల పాలనను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులకు సొంత శాఖల పనులతో పాటు గ్రామపంచాయతీల బాధ్యతలను సైతం నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత పెరిగింది. దీంతో ప్రకృతి వనాల్లోని పండ్లు పూల మొక్కలు ఇతర చెట్లు ఎండిపోకుండా గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తూ కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

ఎండిపోకుండా ఏర్పాట్లు



ఎండల తీవ్రత పెరుగుతుంది. పల్లె ప్రకృతి వనంలోని చెట్లు, పూలు మొక్కలు కాపాడుకోవడానికి జీపీల ద్వారా నీటిని అందించడానికి ఏర్పాట్లు చేస్తాం. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు ఈజీఎస్, జీపీ సిబ్బందితో సమావేశం నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

ఇబ్బందులు లేకుండా ఇంటర్ పరీక్షలు



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సెంటర్లను సిద్ధం చేశామని కుల్కచర్ల మండల తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వివేకనంద కళాశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పరీక్ష సెంటర్లను పరిశీలించామన్నారు. కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత కళాశాలలకు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాములు, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణు, కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- అధికారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమీక్ష

తాండూరు: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి భగీరథ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలో ఎమ్మెల్యే అధికారులు, నియోజవకర్గానికి చెందిన ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మరోవైపు తాండూరు పట్టణ శివారులో ఉన్న కాలనీలకు భగీరథ నీటి సరఫరా జరగడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సరఫరాకు కొత్త పైప్‌లైన్ పనులు చేసేందుకు కావాల్సిన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తాళం!

- ఇబ్బందులు పడ్డ రైతులు, భూముల క్రయ విక్రయదారులు



దోమలో తెరుచుకోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

దోమ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించలేదు. రిజిస్ట్రేషన్లు నిర్వహించే గది తాళం తెరుచుకోలేదు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో.. స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన రైతులు సాయంత్రం వరకు ఎదురు చూసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఆఫీసులో ఇద్దరు ఆర్ఐలు, జూనియర్, రికార్డ్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. ధరణి లాగిన్ ఉన్న అధికారులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు చేయలేదు. డిప్యూటీ తహసీల్దార్ ఇటీవలే బదిలీపై వెళ్లగా తహసీల్దార్ సెలవులో ఉన్నట్లు తెలిసింది. ఇలాంటి సమస్యలు ఉన్న సమయంలో తమకు ముందస్తు సమాచారం ఇస్తే బాగుండేదని కార్యాలయానికి వచ్చిన వారు అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయమై వివరణ కోరేందుకు తహసీల్దార్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

సర్కారు బడికి చేయూత



పాఠశాలకు ప్రింటర్‌ను అందిస్తున్న రాహుల్‌నాయక్

కుల్కచర్ల: సర్కారు బడికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అఖిల భారత బంజార సేవా సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హన్మ్యనాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాలలో ఉన్న విద్యార్థులకు ప్రస్తుత టెక్నాలజీతో కూడిన విద్యను అందించడంలో భాగంగా పాఠశాలకు ప్రింటర్‌ను అందించానన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి సహకారం అందిస్తామన్నారు. తమ తండ్రి రవీందర్‌నాయక్ ఆశయాలకు అనుగుణంగా విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాలినాయుడు, చందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం సరే.. వసతులేవీ?

- నిరుపయోగంగా ఎంపీడీఓ నూతన కార్యాలయ భవనం
- కొత్త భవనంలో కనిపించని ఫర్నిచర్
- బాత్‌రూముల్లో నీటి వసతి కరువు
- పాత భవనంలోనే కార్యకలాపాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం



అసంపూర్తిగా సెప్టిక్‌ట్యాంక్ పనులు

చేవెళ్ల: ఎంపీడీఓ నూతన కార్యాలయం ప్రారంభించారు. కానీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోకుండా పాతకార్యాలయంలోనే విధులు కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పేరుకే కొత్తభవనం అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవటంతో నిరుపయోగంగా మారింది. ఇది చేవెళ్లలో ఇటీవలే ప్రారంభించిన ఎంపీడీఓ నూతన కార్యాలయ భవనం పరిస్థితి. మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలోనే ఖాళీ స్థలంలో కొత్త భవనం నిర్మించారు. ఎన్నో ఏళ్ల తరబడి దీని నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. చివరకు నాలుగు నెలల కిత్రం మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వస్తుందని హడావుడిగా ప్రారంభించారు. అయినప్పటికీ అందులో సౌకర్యాలు కల్పించ లేదు. బయటి నుంచి చూస్తే అందంగా రంగులు వేసి ముస్తాబు చేశారు. కానీ అందులో నీటి వసతి కోసం ట్యాంకు ఏర్పాటు చేయలేదు. బాత్‌రూములకు సంబంధించిన పైపులైన్లు వేయలేదు. సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అధికారులు కొత్త భవనంలోకి వెళ్లేందుకు వెనుకాడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అసంపూర్తిగా భవనం..

ఈ భవన నిర్మాణ పనులు మొదలైనప్పటినుంచి కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపించినా వారిని ఏమి చేయలేని దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ పనితీరుతో విసుగు చెందిన ఉన్నతాధికారులు టెండర్ రద్దు చేసినా మళ్లీ అతడే పూర్తి చేయిస్తానని ఒప్పించి టెండర్ దక్కించుకొని ఏళ్లతరబడిగా పనులు చేయించాడు. పనులు పూర్తి కాకముందే అధికారుల అలసత్వంతో భవనాన్ని ప్రారంభించారు. పెండింగ్ పనులను పూర్తి చేయించేవిషయంలో కాంట్రాక్టర్ ఎవరికీ అందుబాటులో లేడని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



కొన్ని చిన్న, చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్డింగ్‌పై వాటర్ ట్యాంకు లేదు. బాత్‌రూమ్‌లకు సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్ లేదు. ఫర్నీచర్ సైతం లేని విషయం వాస్తవమే. ఈ విషయం గురించి కాంట్రాక్టర్ స్పందించకపోతే ఉన్నతాధికారులకు, ఏఈకి నివేదించాం. దీంతో వారు స్పందించి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

– బి హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

ప్రయాణం నరకప్రాయం



అధ్వానంగా మారిన రోడ్లు

- గుంతలమయంగా బీటీ రోడ్లు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని బీటీ రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏ రహదారి చూసినా గుంతలమయమే. వాటిపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. వికారాబాద్ నుంచి మైలార్‌దేవరంపల్లి, మదన్‌పల్లి, బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు వెళ్లే రోడ్డు, గోధుమగూడకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారింది. ఒకేసారి ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చాయంటే తప్పనిసరి కిందకి దిగాలి. పలుమార్లు వాహనాలు కిందికి దింపే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో బురదలోనే ఇరుక్కున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అనంతగిరి గుట్ట ఘాట్‌లో సైతం బీటీ రోడ్డు దెబ్బతిన్నది. వాహనాలు వచ్చి వెళ్లే క్రమంలో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే ఆటోవాలాలు రోడ్ల దుస్థితితో నడపడమే మానేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి మండల రహదారులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి అనంతస్వామి బృందావన జాతర



శనైశ్చర స్వామి

పెద్దేముల్: జనగాం శివారులోని అనంత స్వామి బృందావనంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతర నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు అనంతయ్య స్వామి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, మంగళహారతి, 8 గంటలకు శనైశ్చర తైలాభిషేకం 10 గంటలకు సిద్ధేశ్వర అభిషేకం, సాయంత్రం 6:30 నిమిషాలకు దీపారాదన, 7:30 భజన, ఆదివారం ఉదయం 7 గంటలకు పంచముఖ ఆంజనేయ స్వామి అభిషేకం, 10గంటలకు పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు, 11:45 కల్యాణం, భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని స్పష్టంచేశారు.

భయాన్ని వీడి.. ధైర్యంగా ఉండండి

- షీ టీం ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

షాద్‌నగర్ రూరల్: బాలికలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలని షీ టీం ఏఎస్ఐ గోపాల్ రెడ్డి సూచించారు. సైబరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు శుక్రవారం కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో షీ టీం బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. చదువుకునే దశలో వివాహాలు చేసుకొని తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. జీవితంలో అనుకున్నది సాధించి తమ కాళ్లపై తాము నిలబడినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు రద్దీ ప్రాంతాలలో అమ్మాయిలపై ఆకతాయిల వేధింపులు అధికంగా ఉంటాయని, వాటిని పసిగట్టి అలాంటి వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం చేరవేయాలన్నారు. విద్యార్థినులు ప్రేమ పేరుతో మోసపోకుండా విద్యపైనే ఏకాగ్రతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిచ్చయ్య, సిబ్బంది ప్రహ్లాద్, డెబోరా మాక్సిన్, వైస్ ప్రిన్సిపాల్ రమ్యభార్గవి, అధ్యాపకులు శిరీష, శారద, జయలక్ష్మి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఆయకట్టు విస్తీర్ణం

- పంటలకు నీరందని వైనం
- కొడంగల్ చెరువుకు మరమ్మతులు చేయాలంటున్న రైతులు



కొడంగల్ చెరువులో పెరిగిన కంప చెట్లు



కట్టపై ఏర్పడిన పగుళ్లు

కొడంగల్: మండల పరిధిలో కొడంగల్ చెరువు పెద్దది. దీనికి 550 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 250 మంది రైతులకు చెరువు కింద పొలాలు ఉన్నాయి. పెద్ద చెరువుగా పేరుగాంచినప్పటికీ పంటలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. ఆయకట్టు విస్తీర్ణం ఏటా తగ్గుతూ వస్తోంది. కొడంగల్ చెరువుతో పాటు 950 ఎకరాల ఆయకట్టు ఉన్న హస్నాబాద్ చెరువు, పెద్ద నందిగామ చెరువు, అంగడిరాయిచూర్ చెరువు, పర్సాపూర్ నోటిఫైడ్ చెరువులదీ అదే పరిస్థితి ఉంది. కేవలం వర్షంపై ఆధార పడి ఇక్కడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వర్షాలు కురిస్తేనే చెరువులు నిండి సాగునీరు అందుతుంది. రెండు దశాబ్దాలకు పైగా చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. వందల ఎకరాల్లో ఆయకట్టు ఉంటే రెవెన్యూ అధికారులు తైబంది నిర్వహించిన నాలుగో వంతు ఆయకట్టుకు కూడా సాగునీరు అందించడం లేదని రైతులు వాపోతున్నారు. సాగు నీటి పారుదల శాఖాధికారులు నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో సాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారింది. వేసవిలో చెరువులకు మరమ్మతులు చేసి సాగు విస్తీర్ణం పెంచాలని రైతులు కోరుతున్నారు. పంటల సాగు పెరిగితేనే పెట్టుబడి గిట్టుబాటు అవుతుందని అన్నదాతలు అంటున్నారు. కొడంగల్ చెరువులో కంప చెట్లు పెరిగాయి. చెరువు కట్టకు పగుళ్లు వచ్చాయి. కట్ట పరిస్థితి అధ్వానంగా మారింది. గత పాలకులతో పాటు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా చేతన్, ఆర్‌జేడీగా వెంకి, కలెక్టర్‌గా ప్రశాంత్, డిప్యూటీ కలెక్టర్‌గా సందీప్, డీఈఓగా శ్రీకాంత్, ఎంఎన్ఓగా సిద్ధార్థ్, ఎంఈఓగా రామ్‌రాజ్ వ్యవహరించగా, మరో 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్య వహరించి, తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రత్నమాల, రాఘవేంద్రచారి, పీడీ చంద్రమోహన్, కౌసల్య, శ్వే తామాధురీ, గోవర్ధన్, భాస్కర్‌రావు, జంగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.